సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం । 25 । జనవరి । 2025



తెలంగాణకు రూ.10లక్షల కోట్లు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: పదేళ్లలో తెలంగాణకు కేంద్రం రూ.10లక్షల కోట్లు ఖర్చు చేసిందని కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ పేర్కొన్నారు. 10లో▸



వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడరూరల్: నాగాయపల్లిలో ఈనెల 28 నుంచి జరిగే దుబ్బరాజేశ్వరస్వామి జాతర వాల్‌పోస్టర్‌ను ఎస్పీ అఖిల్‌మహాజన్ శుక్రవారం ఆవిష్కరించారు.

గరిష్టం/కనిష్టం
31.0/16.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పొద్దంతా ఎండగా, రాత్రి చలిగా ఉంటుంది. తెల్లవారు జామున పొగమంచు కమ్మేసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వేములవాడలో కేంద్ర బృందం



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

వేములవాడ అర్బన్: పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన కేంద్ర వైద్య బృందం వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిని శుక్రవారం సందర్శించింది. ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలు, రికార్డులు పరిశీలించారు. కేంద్ర బృందంలో వైద్యులు ఫ్రాన్సిస్ జేవియర, డాంగ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ పెంచలయ్య, సుభాషిణి, నర్సింగ్ సూపరింటెండెంట్లు అంజమ్మ, సుందరి, సంజీత, నాగరాజు పాల్గొన్నారు.

బకాయి ఒకటి.. కట్ చేసింది మరొకటి !

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సెస్ సంస్థకు బకాయిపడ్డ మీటర్ నంబర్ ఒకటైతే మరో నంబర్‌పై ఉన్న విద్యుత్ సరఫరాను అధికారులు శుక్రవారం నిలిపివేశారు. సెస్ అధికారుల అత్యుత్సాహంతో బకాయిలేని వినియోగదారుడికి కరెంట్ సరఫరా లేకుండా పోయింది. లక్షలు బిల్లు బకాయి ఉన్నవారిని వదిలేసి ఎలాంటి బకాయి లేనివారి ఇళ్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంపై విమర్శలు వస్తున్నాయి.

ప్రభుత్వ పథకాలు అమలు కావట్లేదు



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆరోపించారు. సుభాష్‌నగర్‌లోని పార్టీ ఆఫీసులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీల అమలును అధికార పార్టీ మరిచిపోయిందన్నారు. రూ.2లక్షల రుణమాఫీ అందరికీ అందలేదని, కౌలు రైతులకు రైతు భరోసా రూ.15వేలు కాకుండా రూ.12వేలు ఇస్తామనడంపై పెదవి విరిచారు. మహిళలకు రూ.2500, వృద్ధులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు పెన్షన్ ఇంకా మొదలే కాలేదన్నారు. మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో ఉపాధిహామీ పనులు లేక ఆయా గ్రామాల్లోని ప్రజలు ఇందిరమ్మ ఆత్మీయభరోసాకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు పంతం రవి, శ్రావణపల్లి మల్లేశం, బాచుపల్లి శంకర్, రాములు, రాజేందర్, శంకర్, రాజయ్య పాల్గొన్నారు.

గురుకులంలో 'బేటీ బచావో.. బేటీ పడావో'



గంభీరావుపేట(సిరిసిల్ల): విద్యార్థినులు, మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. మండలంలోని నర్మాల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గురుకులాల్లో కామన్ డైట్ మెనూ అమలు చేస్తున్నట్లు తెలిపారు. సీడీపీవో ఉమారాణి, ప్రిన్సిపాల్ సృజన, డీ–హబ్ కో–ఆర్డినేటర్ రోజా, దేవి, రమ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక పాల్గొన్నారు.

సర్కిళ్లపై చిన్నచూపు



ఇది సిరిసిల్ల పాతబస్టాండు వద్ద చేనేతన్న చౌక్. నాలుగేళ్ల క్రితం రూ.50లక్షలతో సర్కిల్ అభివృద్ధికి మున్సిపల్ పాలకవర్గం నిర్ణయించింది. టెండర్లు అయిపోయినా పనులు ప్రారంభం కాలేదు. నిత్యం వందలాది సంఖ్యలో వాహనాలు, వేలాదిసంఖ్యలో ప్రజలు తిరిగే ఈ చౌరస్తా అభివృద్ధికి నోచుకోక ప్రమాదకరంగా ఉంటోంది.



ఇది జిల్లా కేంద్రంలోని పాతబస్టాండు ఎంట్రన్స్ చౌరస్తా. ప్రధాన రహదారిపై ఇరువైపులా, సంజీవయ్యనగర్ నుంచి ప్రధాన రహదారిపైకి, పాతబస్టాండ్ నుంచి ప్రధాన రోడ్డుపైకి వచ్చే మూలమలుపులు ఉంటాయి. ఎక్కడి నుంచి ఏ వాహనం వస్తుందో తెలువక ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.



నిత్యం రద్దీతో ఉండే ఈ గజీబిజీ సర్కిల్ చంద్రంపేట క్రాస్‌రోడ్డు. రూ.50లక్షలతో అభివృద్ధి చేయాలని మున్సిపల్ పాలకవర్గం చేపట్టిన పనులు నిలిచిపోయాయి. ఫలితంగా సిరిసిల్ల–వేములవాడ–కరీంనగర్, నిజామాబాద్–నిమ్మపల్లి–సిరిసిల్ల ఆర్‌అండ్‌బీ రహదారులకు అనుసంధానమయ్యే ప్రధాన సర్కిల్ అభివృద్ధికి నోచుకోలేదు. విస్తరణ, ట్రాఫిక్ సిగ్నల్స్ కోసం స్థానికుల నివేదనలు బుట్టదాఖలయ్యాయి.



సాక్షి ఫోటో

ఇది కలెక్టరేట్ సమీపంలోని సర్కిల్. హైదరాబాద్–సిరిసిల్ల–కామారెడ్డి, సిద్దిపేట–వేములవాడ మార్గాల నుంచి వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. సిరిసిల్లకు ప్రధాన చౌరస్తాగా మార్చాలన్న తలంపుతో గతంలోనే రూ.75లక్షలతో స్మార్ట్‌సర్కిల్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. వేములవాడ ధార్మిక క్షేత్రానికి హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి వచ్చే యాత్రికులను ఆకట్టుకునేలా ఈ సర్కిల్‌ను అభివృద్ధి చేయాలనుకున్నారు. టెండర్లు పూర్తయినా పనులు మొదలు కాలేదు. ఫలితంగా అన్ని మార్గాల నుంచి వచ్చే వాహనదారులు తికమక పడుతున్నారు.

- విస్తరణకు నోచుకోని ప్రధాన చౌరస్తాలు
- ప్రతిపాదనలకే పరిమితం
- సిరిసిల్లలో పెరుగుతున్న ట్రాఫికర్
- తరచూ రోడ్డు ప్రమాదాలు

సిరిసిల్లటౌన్: కార్మికక్షేత్రంలోని చౌరస్తాలు అభివృద్ధికి నోచుకోలేదు. నిధులు కేటాయించినా పనులు మొదలుపెట్టలేదు. పాలకుల నిర్లక్ష్యానికి ఈ సర్కిళ్లు సజీవసాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. జిల్లా కేంద్రంతోపాటు శివారులోని చౌరస్తాలను అభివృద్ధి చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏళ్లుగా స్థానికుల విన్నపాలు బుట్టదాఖలే అయ్యాయి. సర్కిళ్ల చిన్నచూపుపై ఫోకస్.

సర్కిళ్ల వద్ద సమస్యలు ఇలా..

- కొత్తబస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సులు డిపో, బస్టాండ్‌కు వెళ్లే సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.
- గోపాల్‌నగర్ చౌరస్తాలో బీవైనగర్, తారకరామానగర్, శివనగర్, మార్కెట్‌పల్లి, బోనాల, సుందరయ్యనగర్, ఇందిరానగర్, గణేష్‌నగర్‌ల నుంచి వచ్చే వాహనాలతో ట్రాఫిక్ పెరిగింది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.
- అంబేడ్కర్ సర్కిల్ చుట్టుపక్కల ప్రైవేటు వాహనాలు నిలుపుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.
- నేతన్నచౌక్‌లో పాతబస్టాండ్, వెంకంపేట, పెద్దబజార్, అంబేడ్కర్‌చౌరస్తా నుంచి వచ్చే వాహనాలు తిరుగుతాయి. జంక్షన్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.
- గాంధీసర్కిల్ ఇరుకుగా ఉండడం.. బస్సులు, లారీలు, ఇతర ప్రైవేటు వాహనాలు నిత్యం వందల్లో తిరుగుతుంటాయి. సెస్ ఆఫీస్ నుంచి వేంకటేశ్వరాలయం వైపు వెళ్లే క్రమంలో ఇరుకైన మలుపు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.
- ప్రధాన రహదారులపై ఉన్న చంద్రంపేట, రగుడుతోపాటు పోస్టాఫీస్, బీవైనగర్, సుందరయ్యనగర్, పోలీస్‌స్టేషన్, మార్కెట్ ఏరియా, పెద్దబజార్ జంక్షన్లు విస్తరించాల్సిన అవసరం ఉంది.



ఇది.. జిల్లా కేంద్రంలోని కామారెడ్డి మార్గంలోని గోపాల్‌నగర్. ఇక్కడ బీవై నగర్ నుంచి ప్రధాన రోడ్డుపైకి వచ్చే వారికి కామారెడ్డి నుంచి వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. తాత్కాలిక ఉపశమనం కోసం పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేయగా.. ఏళ్లుగా ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. ఇక్కడ ప్రధాన సర్కిల్‌గా అభివృద్ధి చేపట్టడానికి మున్సిపల్ పాలకవర్గం కార్యాచరణ చేపట్టినా.. వివిధ కారణాలతో ఆచరణకు నోచుకోలేదు.

రగుడు జంక్షన్ పనులు మొదలయ్యాయి



ఐదేళ్లుగా సిరిసిల్లలోని అన్ని సర్కిళ్ల అభివృద్ధికి చర్యలు తీసుకున్నాం. నేతన్నచౌక్, చంద్రంపేట చౌరస్తాల అభివృద్ధికి టెండర్లు పూర్తయినా వివిధ కారణాలతో పనులు నిలిచాయి. గోపాల్‌నగర్ చౌరస్తాకు ఆర్‌డీటీపీ అనుమతులు రావాల్సి ఉంది. రగుడు జంక్షన్ అభివృద్ధికి రూ.2కోట్లతో పనులు ప్రారంభించాం.

– జిందం కళ, మున్సిపల్ చైర్‌పర్సన్

కేటీఆర్‌కు షాక్.. ప్రారంభోత్సవానికి బ్రేక్!

- సిరిసిల్లలో చర్చనీయం
- అధికార,ప్రతిపక్షాల మధ్య వార్



సుభాష్‌నగర్‌లోని కమ్యూనిటీహాల్

సిరిసిల్లటౌన్: మరికొద్ది సేపట్లోనే ప్రారంభించాల్సిన కమ్యూనిటీ భవనానికి అధికారులు తాళాలు వేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. అధికారుల చర్య స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్‌కు షాక్ ఇచ్చినట్లు అయ్యింది. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ కమ్యూనిటీ భవనాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ శుక్రవారం ప్రారంభించాల్సి ఉంది. ఈమేరకు ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం వరకు అక్కడికి బీఆర్‌ఎస్ నాయకులు సైతం చేరుకున్నారు. అంతలోనే మున్సిపల్ అధికారులు సదరు భవనం ప్రారంభోత్సవం కుదరదంటూ తాళాలు వేశారు. దీనిపై సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ లావణ్య మాట్లాడుతూ భవనం పనులు పూర్తికానందునా కలెక్టర్ ఆదేశాలతో ప్రారంభోత్సవం నిలిపివేసినట్లు తెలిపారు.

చర్చనీయం

కమ్యూనిటీ భవనం ప్రారంభోత్సవాన్ని అడ్డుకోవడం రాజకీయంగా చర్చకు దారితీసింది. ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం పూర్తి కావస్తుండడంతో తమ హయాంలో చేసిన పనులను ప్రారంభించేందుకు బీఆర్‌ఎస్ నాయకులు ఏర్పాట్లు చేశారు. దీనికి అధికారిక పార్టీ అడ్డు వేసినట్లు చర్చ సాగుతోంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య రాజకీయకక్షలతో ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్నట్లు చర్చ ఉంది. అధికార పార్టీ ఆధ్వర్యంలో ప్రారంభించాలనే అడ్డుకున్నట్లు మరికొందరు చర్చించుకుంటున్నారు. ఇలా ఎవరికీ వారే పైచేయి సాధించేందుకు చేసిన ప్రయత్నాలు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు హాట్‌హాట్‌గా మారిపోయాయి.

జవాబుదారీగా పనిచేశాం

- 2014కు ముందు ఇప్పుడు తేడా చూడండి
- సిరిసిల్ల, వేములవాడలను ఎంతో అభివృద్ధి చేశాం
- ప్రజలు మీ సేవలను ఎన్నటికీ మరువరు..
- ప్రజా సమస్యలపై నిరంతరంగా పోరాడుదాం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పాలకవర్గాలకు సన్మానం



సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్‌లను సన్మానించి, మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్లటౌన్: ప్రజలు మనకు ఇచ్చిన తొమ్మిదిన్నరేళ్ల అధికారంలో జవాబుదారీగా పనిచేశామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు పేర్కొన్నారు. సిరిసిల్ల శివారులోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు నిర్వహించిన సన్మాన సమావేశంలో మాట్లాడారు. మరో 40 ఏళ్ల తర్వాత బిడ్డలు మిమ్మల్ని యాది చేసుకునేలా పట్టణాలను అభివృద్ధి చేశామన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో పల్లె, మున్సిపల్ స్వచ్ఛ సర్వేక్షన్‌లో దేశంలోనే అత్యధికంగా అవార్డులు పొందాయని ఇదే బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమానికి గీటురాయిగా చెప్పుకొచ్చారు. సిరిసిల్లలో వార్డుల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.40కోట్లు నిధులు కేటాయిస్తే..తర్వాత వచ్చిన కాంగ్రెస్ సర్కారు కుట్రపూరితంగా వాటిని పక్కనబెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో మన పార్టీ లేదని నిరుత్సాహపడకుండా ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలపై ప్రజలు నిలదీస్తుంటే అధికారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో హామీలు అమలని, 400 రోజులు గడిచినా ఒక్కటి అమలు కాలేదని విమర్శించారు. ప్రజలకు సమాధానం చెప్పలేకనే గ్రామసభలు అంటూ టైమ్ పాస్ చేస్తుంద్రని విమర్శించారు.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు సన్మానం

సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కౌన్సిలర్లను కేటీఆర్ సన్మానించారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ–చక్రపాణి, వేములవాడ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి–రాజు దంపతులతోపాటు రెండు మున్సిపల్ కౌన్సిలర్లను సన్మానించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, వేములవాడ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మంచె శ్రీనివాస్, బొల్లి రామ్మోహన్, దార్నం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.2కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అందించిన రూ.2కోట్లతో సిరిసిల్లలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కేటీఆర్ శ్రీకారం చుట్టారు. స్థానిక 1, 9, 21, 34 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ తదితర నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, దార్నం లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్గీకరణ చేయాల్సిందే..



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మందకృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు

- ఇప్పుడు కాకుంటే ఎప్పటికీ కాదు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ

సిరిసిల్లటౌన్: ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో 'వెయ్యి గొంతులు–లక్ష డప్పులు' మహాప్రదర్శన విజయవంతానికి శుక్రవారం సిరిసిల్లలోని ఓ కన్వెన్షన్‌హాల్‌లో నిర్వహించిన సన్నాహక సదస్సుకు హాజరై మాట్లాడారు. హైదరాబాద్‌లో జరిగే మహాప్రదర్శనకు ప్రతీ మాదిగ బిడ్డ, సంకన డప్పు వేసుకొని కదలాలని కోరారు. రేపటి మన బిడ్డల భవిష్యత్‌కు ఉద్యమించాలని కోరారు. ఈ సందర్భంగా సిరిసిల్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాసు, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, తాళ్లపల్లి ప్రభాకర్, కళామండలి రాష్ట్ర కో ఆర్డినేటర్ దరువు ఎల్లన్న, ఏపూరి సోమన్న ,ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రామంచ భరత్, జిల్లా అధ్యక్షుడు గజ్జెల అశోక్, రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రుద్రారపు రామచంద్రం, రాష్ట్ర నాయకులు, ఆవునూరి ప్రభాకర్, మహిళా విభాగం జాతీయ నాయకురాలు జేపీ లత, ఎంఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు కానాపురం లక్ష్మణ్, గుండ్రెడ్డి రాజు, ఎలగందుల భిక్షపతి పాల్గొన్నారు.



గులాబీ అందుకో.. భద్రంగా చేరుకో

వేములవాడఅర్బన్: 'గులాబీ పువ్వు అందుకో.. భద్రంగా గమ్యం చేరు..' అంటూ అధికారులు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. వేములవాడలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎంవీఐ వంశీధర్ మాట్లాడుతూ మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ బస్సులు నడపొద్దని సూచించారు. డీఎం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పులి ఆనవాళ్లపై ఆరా

- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- విద్యుత్ కంచెలు తొలగించాలి
- ఎఫ్ఆర్వో ఖలీలొద్దీన్



చందుర్తి అటవీ ప్రాంతంలో పులి ఆనవాళ్ల కోసం గాలిస్తున్న ఎఫ్ఆర్వో, డిప్యూటీ ఎఫ్ఆర్వో

చందుర్తి(వేములవాడ): రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సరిహద్దు ప్రాంతం చందుర్తి–కొడిమ్యాల అటవీప్రాంతంలో పులి సంచరిస్తోందన్న సమాచారంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కొండాపూర్ అటవీ ప్రాంతంలో ఆవుపై దాడిచేసిన పులి చందుర్తి వైపు వచ్చిందన్న సమాచారంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వేములవాడ అటవీ క్షేత్రాధికారి ఖలీలొద్దీన్, డిప్యూటీ ఎఫ్ఆర్వో రాఘవేందరావు ఆధ్వర్యంలో అటవీప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలోని నర్సింగపూర్, తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లి, రామన్నపేట, చందుర్తి, మల్యాల గ్రామాల్లోని రైతులు తమ పొలాల వద్దకు వెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, పంట చేలకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలను తొలగించాలని సూచించారు. గొర్రెలకాపరులు సైతం జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆపద సమయంలో 100 కాల్ డయల్ చేస్తే స్పందిస్తామని ఎస్సై అంజయ్య తెలిపారు.

నిరసనలు.. నిలదీతలు



రాచర్లబొప్పాపూర్‌లో నిలదీస్తున్న గ్రామస్తులు

వేములవాడరూరల్/బోయినపల్లి/ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామసభల్లో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. అర్హుల పేర్లు జాబితాలో లేవని, అనర్హులను ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. బోయినపల్లిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల జాబితాలో భూమి ఉన్న వారి పేర్లు ఎలా వస్తాయని నిలదీశారు. ఎంపీడీఓ భీమ జయశీల మాట్లాడుతూ గ్రామస్తులు రాసి ఇస్తే అనర్హులని తొలగిస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పేర్లపై గ్రామస్తులు నిలదీశారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో గ్రామసభ రసాభాసగా మారింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. ఇరువర్గాల మధ్యతీవ్ర వాగ్వాదం జరగడంతో పోలీసులు అక్కడికి చేరుకొని శాంతింపజేశారు. అంతకుముందు ఎస్పీ అఖిల్‌మహాజన్ గ్రామసభను పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, ఎంపీడీవో సత్తయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పాల్గొన్నారు.

ప్రజల మధ్యే లబ్ధిదారుల ఎంపిక

ప్రజల మధ్యే లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ రూరల్ మండలం వెంకటాంపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 26 నుంచి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇల్లు మంజూరవుతాయని తెలిపారు. తహసీల్దార్ సుజాత, ఏఎంసీ చైర్మన్ రాజు, మాజీ సర్పంచ్ బండ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్, కార్యదర్శి మనీష, గ్రామస్తులు పాల్గొన్నారు.



పెరిగిన లోడ్... పేలిన టైర్

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం తుర్కపల్లి వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు టైర్ పేలింది. త్రుటిలో ప్రయాణికులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఆ సమయంలో బస్సులో 70 మంది ప్రయాణిస్తున్నారు. అత్యధికులు మహిళలు, విద్యార్థులు ఉన్నారు. వేగం తక్కువగా ఉండడంతో ప్రమాదం తప్పిందని ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

క్లుప్తంగా

సీఎం దృష్టికి పోలీసు బందోబస్తు ఇష్యూ

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లో కేంద్ర, రాష్ట్రమంత్రుల పర్యటన సందర్భంగా పోలీసుల బందోబస్తు తీరుపై మంత్రి పొంగులేటి శుక్రవారం అసంతృప్తి వ్యక్తంచేశారు. మంత్రులు హెలీప్యాడ్ మొదలు పలుఅభివృద్ధి కార్యక్రమాల వేదికల వరకు పోలీసులు ప్రొటోకాల్ పాటించలేదని మండిపడ్డారు. సీపీ ఎక్కడా? ఏసీపీ ఎక్కడా? అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసుల ప్రొటోకాల్‌ను విస్మరించారని ఆగ్రహంవ్యక్తంచేసిన మంత్రి పొంగులేటి సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రూ.15 లక్షల విరాళం



కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ మార్కెట్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణకు తనవంతు సహకారంగా రూ.15 లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి ప్రకటించారు. ఫిబ్రవరి 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం ఆలయ ఆవరణలో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఈ మొత్తాన్ని ప్రకటించారు.

బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్

ఇల్లంతకుంట(మానకొండూర్): పెరోల్‌పై బయటకు వచ్చిన జీవితఖైదీ ఓ వివాహితను బెదిరించి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డ వ్యక్తిని అరెస్టు చేశారు. సిరిసిల్లరూరల్ సీఐ మొగిలి తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరికి చెందిన జీవితఖైదీ శిక్ష అనుభవిస్తున్న వెదిరె పరుశురాం(34)కు కరీంనగర్‌కు చెందిన వివాహితతో పరిచయముంది. పరుశురాం గతనెల 24న పెరోల్‌పై బయటకు వచ్చాడు. కరీంనగర్‌లో తనకు పరిచయమైన వివాహితను ఈనెల 20న కలిశాడు. తన సెల్‌ఫోన్‌లో ఆమె ఫొటోలు ఉన్నాయని బెదిరించి తన బైక్‌పై అనంతగిరికి తీసుకొచ్చాడు. తన ఇంట్లో గత మూడు రోజులుగా లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం బాధితురాలిని ఈనెల 23న తన బైక్‌పై పెద్దలింగాపురం వైపు తీసుకెళ్తుండగా కేకలు వేయడంతో ఆమెను అక్కడ వదిలేసి తన బైక్‌పై పరారయ్యాడు. పరారీలో ఉన్న అతనిని శుక్రవారం అనంతగిరిలో పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితుని నుంచి ఒక బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇల్లంతకుంట ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఉన్నారు.

క్రీడామైదానంలో ఒకరి మృతి

హుజూరాబాద్: మున్సిపల్ పరిధిలోని గణేశ్‌నగర్‌కు చెందిన సోయం రాజు(36)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. రాజు దినసరి కూలీ. కొన్నాళ్లుగా మద్యానికి బానిసై, అనారోగ్యానికి గురయ్యాడు. అప్పుడప్పుడు ఫిట్స్ వచ్చేవని భార్య శిరీష వెల్లడించింది. ఈనెల 22న ఉదయం ఇంట్లోంచి వెళ్లిపోయాడని, శుక్రవారం మైదానంలో చనిపోయి ఉన్నట్లు తెలిసినవారి ద్వారా సమాచారం అందిందని తెలిపింది. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. తన భర్త మృతిపై ఎలాంటి అనుమానం లేదని, అనారోగ్యంతో చనిపోయాడని శిరీష పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వెల్లడించింది. ఈ మేరకు సీఐ తిరుమల్ గౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రాజు (ఫైల్)

పదేళ్లలో తెలంగాణకు రూ.10 లక్షల కోట్లు

- ఈ ఏడాది దేశంలో కోటి ఇండ్లు నిర్మాణ లక్ష్యం
- నాలుగేండ్లల్లో ప్రతి ఇంటికి నల్లా నీళ్లు
- కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్



హౌజింగ్ బోర్డుకాలనీలోని పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ఖట్టర్

సాక్షిప్రతినిధి,కరీంనగర్: గత పది సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేసిందని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. స్మార్ట్ సిటీ కింద కరీంనగర్‌లో పూర్తయిన పలు ప్రాజెక్టులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. హౌసింగ్‌బోర్డుకాలనీలో జరిగిన పబ్లిక్ మీటింగ్‌లో మాట్లాడారు. తెలంగాణలో రోడ్ల నిర్మాణం కోసం రూ.1 లక్షా 20 వేల కోట్లు, ధాన్యం కొనుగోలుకు రూ.1.10 లక్షల కోట్లు వెచ్చించామన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు కోసం రూ.26 వేలు కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. రైల్వే లైన్, రైల్వే స్టేషన్‌ల అభివృద్ధికి పదేళ్లలో రూ.32 వేల 946 కోట్లు కేటాయించామని తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలోనే రైల్వే బడ్జెట్ లో తెలంగాణకు రూ.5 వేల 336 కోట్లను కేటాయించామన్నారు. వీధి వ్యాపారుల కోసం స్వనిధి పథకం కింద తెలంగాణలో 4 లక్షల 25 వేల మందికి లబ్ధి జరిగిందన్నారు. పీఎం ముద్ర పేరిట దేశవ్యాప్తంగా తెలంగాణలో 73 లక్షల అకౌంట్లలో రూ.73 వేలకోట్లు జమ చేశామని తెలిపారు. జన్‌ధన్ పేరిట దేశవ్యాప్తంగా 52 కోట్ల 20 లక్షల మందికి బ్యాంక్ ఖాతాలు ప్రారంభిస్తే, తెలంగాణలో కోటి 20 లక్షల ఖాతాల్లోకి నేరుగా వివిధ సంక్షేమపథకాల సబ్సీడీ జమ చేస్తున్నామన్నారు. పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన కింద తెలంగాణలో 69 లక్షల 80 వేల మంది పథకంలో ఉన్నారన్నారు. పీఎం సురక్షాబీమా యోజన కింద తెలంగాణలో కోటి 50 లక్షల మంది కొనసాగుతున్నారన్నారు. గరీబ్‌కళ్యాణ్ యోజన కింద తెలంగాణలో కోటి 91 లక్షల మంది లబ్ధిపొందుతున్నారన్నారు. 2029 వరకు ఉచిత బియ్యం పథకాన్ని కొనసాగించాలని నిర్ణయించామన్నారు. స్వచ్ఛ భారత్ కింద తెలంగాణలో 31 లక్షల 27 వేల మరుగుదొడ్లు నిర్మించి మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించామన్నారు. ఉజ్వల యోజన కింద తెలంగాణలో 11 లక్షల 85 వేల కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. పీఎం కిసాన్ యోజన కింద తెలంగాణలో 30 లక్షల 70 వేల మంది రైతులకు రూ.6 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామన్నారు. ఎరువుల మీద ఇప్పటి వరకు దాదాపు రూ.30 వేల కోట్లు సబ్సిడీని తెలంగాణ రైతులకు అందించామన్నారు. ఒక్కో యూరియా బస్తా మీద రూ. 2,236 లు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. రామగుండంలో యూరియా పరిశ్రమ ఏర్పాటు చేసి ఎరువుల కొరత అనేది లేకుండా చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. రోజ్‌గార్ మేళా పేరుతో 9 లక్షల 25 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించామన్నారు. త్వరలో 10 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. ఐదేళ్లలో పీఎం ఆవాస్ యోజన పథకం కింద దేశంలో మరో 3 కోట్ల ఇండ్లను నిర్మించాలని నిర్ణయించామని, ఈ ఏడాది కోటి ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా దేశంలోని 74 శాతం గృహాలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నామని, ఫలితంగా డయేరియా సంబంధిత మరణాలు మూడు లక్షలు తగ్గాయన్నాయని ఖట్టర్ తెలిపారు. తెలంగాణలో 38 లక్షల 30 వేల ఇండ్లకు నల్లా కనెక్షన్లు అందించామన్నారు. కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే 24 గంటలు తాగునీటి సరఫరా చేసే నగరం లేదని, కరీంనగర్ ఆ కీర్తిని సొంతం చేసుకోవడం గర్వకారణమన్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో 0.7 శాతం మాత్రమే ఇండ్లు వచ్చాయని, రాష్ట్ర వాటా ప్రకారం 8 శాతం రావాలన్నారు. హైదరాబాద్‌లో చేపడుతున్న మూసీ ప్రక్షాళనకు, మెట్రో రైలు మరో 75 కిలోమీటర్లు పొడిగించేందుకు కేంద్ర సహకరించాలని కోరారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పట్టణీకరణ వేగంగా జరుగుతోందని, కేంద్ర సహకరించాలన్నారు.

వాటిజ్ దిస్...వేర్ ఈజ్ సీపీ?

- కలెక్టర్‌పై 'పొంగులేటి' మండిపాటు

'వాటిజ్ దిస్ నాన్సెన్స్...వేర్ ఈజ్ సీపీ...వేర్ ఈజ్ ఏసీపీ...కామన్‌సెన్స్ లేదు...ఇదేం పద్ధతి' అంటూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్ పమేలా సత్పతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్‌బోర్డుకాలనీలో 24/7 నీటి సరఫరాను ప్రారంభిస్తున్న క్రమంలో గన్‌మెన్‌లు కొందరు పదేపదే పొంగులేటిని తోసివేయడంతో ఆయన తీవ్ర అసహనానికి గురయ్యారు. కేంద్ర, రాష్ట్ర మంత్రుల పర్యటనలో ఏర్పాట్లపై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇదేం పద్ధతంటూ కలెక్టర్‌పై మండిపడ్డారు. సీపీ ఎక్కడా, ఏసీపీ ఎక్కడా అంటూ నిలదీశారు. అయితే వారెవరు అక్కడ లేకపోవడంతో ఆయన మరింత ఆగ్రహానికి గురయ్యారు.



కలెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

అండాశయ తిత్తితో యువతి విలవిల

- లాపరోస్కోపిక్‌తో మెరుగైన శస్త్రచికిత్స
- జీజీహెచ్‌లో తొలిసారి గైనిక్ విభాగంలో సర్జరీ



శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్యులు

కోల్‌సిటీ(రామగుండం): తీవ్రమైన కడుపునొప్పితో తల్లడిల్లుతున్న ఓ యువతికి గోదావరిఖని జనరల్ ప్రభుత్వ ఆస్పత్రి(జీజీహెచ్) వైద్యులు లాపరోస్కోపిక్ ద్వారా సర్జరీ చేశారు. గైనకాలజీ విభాగంలో తొలిసారి ఈ తరహా శస్త్ర చికిత్స చేయడంపై పలువురు అభినందిస్తున్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలానికి రజిత(19) టోర్షన్(అండాశయాలకు రక్త సరఫరాను నిలిపివేయడానికి దారితీసే అండాశయ ట్విస్ట్) సమస్యతో తీవ్రమైన కడుపునొప్పితో విలవిల్లాడుతోంది. ఈనెల 22న జీజీహెచ్ గైనిక్ విభాగంలో డాక్టర్లకు చూపించగా, అడ్మిట్ చేసుకొని అన్ని వైద్యపరీక్షలు నిర్వహించారు. అత్యవసరంగా శస్త్ర చికిత్స చేయాలని గైనిక్ హెచ్‌వోడీ అరుణ నిర్ణయానికి వచ్చారు. జనరల్ సర్జన్ దామెర అనిల్‌కుమార్ సమక్షంలో గైనిక్ ప్రొఫెసర్ శ్రీదేవి, అనెస్తీసియా మౌనికతో కలిసి లాపరోస్కోపిక్ ద్వారా విజయవంతంగా సర్జరీ నిర్వహించి అండాశయ తిత్తిని తొలగించారు. తొలిసారి ఈ తరహా సర్జరీని సక్సెస్‌గా చేసినట్లు డాక్టర్ అరుణ తెలిపారు. కొత్తగా ఏర్పడిన మెడికల్ కాలేజీల బోధనాస్పత్రుల్లో లాపరోస్కోపిక్ సర్జరీలు జరగడం లేదని, కానీ గోదావరిఖనిలో అనేక రిస్క్ కేసులను కూడా చాలెంజ్‌గా తీసుకొని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండడంతోనే రిస్క్ కేసులను వైద్యుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. యువతి పూర్తి ఆరోగ్యంతో కోలుకుందని, త్వరలోనే డిశ్చార్జి చేస్తామని తెలిపారు. వైద్యులను ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, ఆర్‌ఎంవోలతోపాటు హెచ్‌వోడీ, ప్రొఫెసర్లు అభినందించారు.

భూమిపత్రాలు లాక్కెళ్లిన రౌడీషీటర్, విలేకరి అరెస్ట్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడరూరల్ సర్కిల్ పరిధిలోని బోయినపల్లికి చెందిన ఇంటి కొనుగోలు వ్యవహారంలో భూమిపత్రాలను బలవంతంగా లాక్కెళ్లిన రౌడీషీటర్‌తోపాటు బోయినపల్లి మండల విలేకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడరూరల్ సీఐ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు. బోయినపల్లికి చెందిన శ్రీనివాస్ హోటల్ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల అతని కూతురు పెళ్లి కోసం ఇంటిని అమ్మకానికి పెట్టాడు. బోయినపల్లికి చెందిన ఓ విలేకరి(సాక్షి కాదు) రవీందర్‌ను సంప్రదించి ఇంటి విక్రయంలో సహకరించమని కోరారు. వేములవాడకు చెందిన రౌడీషీటర్ కడారి తిరుపతిని రవీందర్ పరిచయం చేశాడు. రూ.77 లక్షలకు ఇంటిని కొనేందుకు తిరుపతి ఒప్పందం చేసుకొని, అడ్వాన్స్‌గా రూ.50 వేలు ఇచ్చి అగ్రిమెంట్ రాసుకున్నారు. ఇంటి యజమాని శ్రీనివాస్ భార్య లక్ష్మి ఇల్లును రూ.77 లక్షలకు అమ్మినట్లుగా కడారి తిరుపతి స్నేహితుడైన చొప్పరి శివ కొంటున్నట్లుగా కేవలం రూ.20 లక్షలు చెల్లించిన తర్వాత రిజిస్ట్రేషన్ చేసేలా తప్పుడు ఒప్పందపత్రం రాయించారు. మిగతా రూ.57లక్షల ప్రస్తావన అగ్రిమెంట్ పేపర్‌లో రాయకుండా జాగ్రత్తపడ్డారు. రిజిస్ట్రేషన్ కోసం ఇంటి పత్రాలను శ్రీనివాస్‌ను అడుగగా అవి బ్యాంకులో తాకట్టులో ఉన్నాయని తెలిపాడు. శ్రీనివాస్ ఖాతాకు రూ.3.50 లక్షలు ఒకసారి, రూ.2.80 లక్షలు మరోసారి పంపించారు. బ్యాంకులో ఉన్న పత్రాలను విడిపించుకున్నారు. జనవరి 10న స్లాట్‌బుకింగ్ చేసుకుని లక్ష్మిని వేములవాడ పిలిచి రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి చేశారు. మిగతా డబ్బులు రూ.57లక్షల విషయం అడిగితే అగ్రిమెంట్‌పత్రంలో రాయలేదు కదా ఇవన్నీ లేకుండానే రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి చేశారు. అనుమానం వచ్చి శ్రీనివాస్ అక్కడి నుంచి వెళ్లివచ్చాడు. జరిగిన మోసాన్ని గ్రహించాడు. రౌడీషీటర్ తిరుపతి బోయినపల్లిలోని శ్రీనివాస్ ఇంటికెళ్లి బెదిరింపులకు పాల్పడ్డాడు. రిజిస్ట్రేషన్‌కు సంతకాలు పెట్టకపోతే కుటుంబం మొత్తాన్ని చంపేస్తానని బెదిరించి ఒరిజినల్ డాక్యుమెంట్స్ తీసుకెళ్లాడు. ఆ తర్వాత శ్రీనివాస్ విలేకరి రవీందర్ దగ్గరికి వెళ్లి తిరుపతి బెదిరింపులపై నిలదీయగా.. అతను చెప్పినట్లు రిజిస్ట్రేషన్ చేయాలని, అతను అనుకున్నది చేస్తాడన్నారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదుతో రౌడీషీటర్ తిరుపతితోపాటు విలేకరి రవీందర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

లోవోల్టేజీ సమస్య.. ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి రైతు నిరసన



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి నిరసన తెలుపుతున్న రైతు సిరవేణి రాజేశం

ఇల్లంతకుంట(మానకొండూర్): లోవోల్టేజీ సమస్యతో తన వ్యవసాయబావి మోటార్ నడవడం లేదని.. అధికారులకు ఎంత చెప్పినా పట్టించుకోవడం లేదని నిరసిస్తూ ఓ రైతు ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి నిరసన తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం ముస్కానిపేటకు చెందిన సిరవేణి రాజేశం వ్యవసాయ బావి మోటార్ లోవోల్టేజీ సమస్యతో నడవడం లేదు. దగ్గరలో ఉన్న కాల్వలో కొందరు రైతులు అక్రమంగా మోటార్లు పెట్టుకోవడంతోనే లోవోల్టేజీ వస్తుందని సెస్ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో విసిగిపోయిన రాజేశం శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎక్కాడు. ఈ విషయం తెలుసుకున్న రాజేశం భార్య రమ్య అక్కడికి చేరుకొని సమీప రైతులను పోగుచేసింది. అంతలోనే సెస్ అధికారులు అప్రమత్తమై ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఇల్లంతకుంట పోలీస్ సిబ్బంది, విద్యుత్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని రైతుకు నచ్చజెప్పి కిందికి దింపారు. సెస్ లైన్‌మన్ ఎల్లయ్య, హెల్పర్లు రమేష్, తిరుపతి కాల్వలో రైతులు అక్రమంగా పెట్టుకున్న విద్యుత్ మోటార్ల కనెక్షన్‌లు తొలగించారు.

వృద్ధుడి ఆత్మహత్య

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలకేంద్రానికి చెందిన జంగిడి లింగం(75) అనే వృద్ధుడు అనారోగ్యంతో శుక్రవారం ఉరివేసుకున్నాడు. లింగం కొంతకాలంగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఎన్ని మందులు వాడినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

తెలంగాణకే తలమానికంగా సర్వాయిపేట

- మంత్రి పొన్నం ప్రభాకర్



సర్వాయిపేట కోటపై పాపన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి పొన్నం

సైదాపూర్: తెలంగాణకే తలమానికంగా సర్దార్ సర్వాయి పాపన్న సర్వాయిపేట కోటలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సైదాపూర్ మండలంలో మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం పర్యటించారు. వెన్నంపల్లిలో వ్యవసాయ సహకారం సంఘం నూతన భవనాన్ని ప్రారంభించారు. సోమారంలో ఆదర్శ పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు వరద ప్రమాదం పొంచి ఉందని చుట్టూ కంపౌండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతిని ఆదేశించారు. అప్పటికప్పుడే కలెక్టర్ రూ.60లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మండలంలోని సర్వాయిపేట సర్దార్ సర్వాయి పాపన్న గుట్ట వద్ద పాపన్న విగ్రహానికి పూలమాల వేసి, పాపన్న కోటలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రూ.4.70కోట్ల పనులు ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు సర్వాయిపేటను దర్శించుకునేలా ఫేజ్–1, ఫేజ్–2లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. సర్వాయిపేట కొమ్ముగుట్టపై పాపన్న రాజ్యపాలనలో ఏర్పాటు చేసిన ఆలయాలతో పాటు రాయికల్ వాటర్ ఫాల్స్, మహాసముద్రం గండిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో రమేశ్‌బాబు, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఏఎంసీ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొంత సుధాకర్, వెన్నంపల్లి పీఏసీఎస్ చైర్మన్ బిల్లా వెంకటరెడ్డి, నాయకులు గుండారపు శ్రీనివాస్, మిట్టపెల్లి కిష్టయ్య, తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో యాదగిరి, పాపన్న గౌడ సంఘం నాయకులు కలర్ సత్తన్న, నర్సాగౌడ్ పాల్గొన్నారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

శివయ్యా కరుణించయ్యా

వేములవాడ: రాజన్నను శుక్రవారం 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ఇటీవల నిర్వహించిన 18 మంది ఉద్యోగుల అంతర్గత బదిలీల్లో కిరికిరి మొదలైంది. ఆరోపణలు లేకున్నా కిందిస్థాయి ఉద్యోగులను బదిలీ చేశారని మదనపడుతున్నారు. మహాశివరాత్రి జాతర సందర్భంగా పరిపాలనా సౌలభ్యం కోసం ఈవో వినోద్‌రెడ్డి ప్రాథమికంగా కింది స్థాయి ఉద్యోగుల నుంచి అంతర్గత బదిలీల ప్రక్రియ ప్రారంభించినట్లు మరికొందరు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

బెదిరింపులకు పాల్పడ్డ మాజీ నక్సలైట్లు అరెస్ట్

సిరిసిల్లకల్చరల్: ఇద్దరు మాజీ నక్సలైట్లతోపాటు మరొకరిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. విక్రయించిన భూమిని తిరిగి దక్కించుకునే యత్నంలో బెదిరింపులకు పాల్పడ్డ ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిరిసిల్లలోని వేంకటేశ్వరటెంపుల్ వీధికి చెందిన మర్రిపెల్లి శ్రీనివాస్, రమేశ్, సందీప్ ఉమ్మడిగా పెద్దూరు శివారులోని 55/జీ సర్వేనంబర్‌లో గల 3 ఎకరాల 16 గుంటల స్థలాన్ని పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన నక్క రాజు నుంచి 2016లో కొనుగోలు చేశారు. అప్పటి నుంచి వ్యవసాయం చేసుకుంటున్నారు. అదే స్థలాన్ని నక్క రాజు 2015లో దండుగుల యాదమ్మ వద్ద కొనుగోలు చేశాడు. కొత్త జిల్లాలు ఏర్పడడంతో భూముల ధరలు పెరిగాయి. దీంతో ఆ భూమిని తిరిగి దక్కించుకోవాలని దండుగుల యాదమ్మ, కొడుకు రాజు, కోడలు లక్ష్మి ప్రయత్నించారు. ఈక్రమంలో మాజీ నక్సలైట్లు మేరుగు లక్ష్మణ్, ముదం ప్రసాద్‌తో కలిసి మర్రిపెల్లి శ్రీనివాస్ సోదరులను బెదిరించారు. ఈ నేపథ్యంలోనే రాజు, యాదమ్మ, లక్ష్మిలపై ఐదు కేసులు నమోదయ్యాయి. మళ్లీ ఈనెల 19న స్థలం వద్ద ఉన్న శ్రీనివాస్‌ను సెప్టిక్‌ట్యాంక్ వాహనంలో తోసి చంపేస్తానని బెదిరించాడు. పైగా స్థలాన్ని కుదువపెట్టి నక్క రాజు వద్ద రూ.16లక్షలు అప్పు తీసుకున్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించి భూమి తనదేనని వాదించాడు. విక్రయించిన స్థలంలో రాజు తన కుటుంబ సభ్యుల సమాధులు నిర్మించి స్థలం జోలికి వస్తే చంపుతానని బెదిరించాడని శ్రీనివాస్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

తిమ్మాపూర్(మానకొండూర్): అల్గునూర్ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్తకు గాయాలు కాగా భార్య మృతిచెందింది. ఎల్‌ఎండీ ఎస్సై వివేక్ తెలిపిన వివరాలు.. మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన శ్రీనివాసచారి– గౌతమి(30) దంపతులు ఉదయం 10:45 గంటలకు కరీంనగర్ నుంచి బైక్‌పై అన్నారం వెళ్తున్నారు. అల్గునూర్ శివారులోని లక్ష్మీనర్సింహ ఫంక్షన్‌హాల్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. గౌతమి తలపై నుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గాయాలపాలైన శ్రీనివాసచారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసచారి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మృతదేహాన్ని పరిశీలించారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

అందుబాటులోకి వృద్ధాశ్రమం

- దరఖాస్తులకు ఆహ్వానం



సుల్తానాబాద్(పెద్దపల్లి): ఆలనాపాలనకు నోచుకోని వృద్ధులకు ఆశ్రయం కల్పించాలనే లక్ష్యంతో స్థానిక మార్కండేయకాలనీలో నిర్మించిన వృద్ధాశ్రమం ప్రారంభానికి సిద్ధమైంది. 2023 జనవరి 24న అప్పటి ప్రభుత్వం రూ.70 లక్షల వ్యయంతో ఆశ్రమ నిర్మాణం ప్రారంభించింది. ప్రస్తుతం నిర్మాణం పూర్తయ్యింది. నిర్వహణ కోసం ఎన్జీవోలు దరఖాస్తు చేసుకోవాలని డబ్ల్యూవో వేణుగోపాల్‌రావు తెలిపారు. వృద్ధాశ్రమ భవనాన్ని 50 పడకల సామర్థ్యంతో నిర్మించారు. జిల్లాలో ఏకైక ప్రభుత్వ వృద్ధాశ్రమం ఇదే. నిబంధనలకు లోబడి పనిచేసే ఎన్జీవోకు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు. ఆసక్తిగలిఆరు ఈనెల 21 – 31వ తేదీలోగా కలెక్టరేట్‌లోని డీడబ్ల్యూవో కార్యాలయంలో సంప్రదించాలి. వివరాలకు 94408 52495 ఫోన్ నంబరులో సంప్రదించాలి.

ప్రమాదంలో ఒకరి దుర్మరణం

సైదాపూర్: మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన గుంటి శ్రీనివాస్(35) వెన్కెపల్లి శివారులో సైదాపూర్–హుస్నాబాద్ ప్రధాన రహదారిపై జరిగిన ప్రమాదంలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. శ్రీనివాస్ శుక్రవారం దుద్దెనపల్లిలో ఇటీవల మృతి చెందిన ఓ కుటుంబాన్ని పరామర్శించి తిరిగి వస్తుండగా దుద్దెనపల్లి వెన్కెపల్లి మధ్య బ్రిడ్జి దాటిన తర్వాత మూలమలుపు వద్ద మృతి చెంది ఉన్నాడు. ప్రమాదం ఎలా జరిగిందో తెలియాల్సి ఉందన్నారు. మృతుడికి భార్య నిరోష, కుమారుడు, కూతురు ఉన్నారు.

అనారోగ్య సమస్యలతో మహిళ ఆత్మహత్య



మేడిపల్లి: భీమారం మండల కేంద్రానికి చెందిన చెరుకూరి లక్ష్మి (53) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాలు.. లక్ష్మి కొంతకాలంగా కడుపునొప్పి, క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదు. క్యాన్సర్ చికిత్సకు అధిక మొత్తంలో ఖర్చు అవుతుందని, అంతేగాక తన కొడుకు, కోడలు మూడేళ్ల నుంచి వేరుగా ఉంటున్నారని మానసికంగా బాధపడుతుండేది. ఈక్రమంలో జీవితంపై విరక్తిచెంది ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కూతురు గుడ్ల స్వప్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజు తెలిపారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి

- జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అంజయ్య



మాట్లాడుతున్న అంజయ్య

సిరిసిల్ల: బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని, ఆత్మవిశ్వాసంతో రాణించాలని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కె.అంజయ్య పేర్కొన్నారు. సిరిసిల్ల శివారులోని పెద్దూరు స్కూల్‌లో శుక్రవారం హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలిక దినోత్సవంలో పాల్గొన్నారు. అంజయ్య మాట్లాడుతూ బాలికలు విద్యతోనే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. ఎంచుకున్న రంగంలో ముందుండి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని కోరారు. విద్యనే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. ప్రముఖ సైకాలజిస్ట్ కె.పున్నంచందర్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ ఎక్కువగా ఉపయోగించడంతోనే అనర్థాలు జరుగుతున్నాయన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. పిల్లలు తప్పుదారి పట్టకుండా చూడాలని సూచించారు. హెల్పింగ్ హార్ట్స్ అధ్యక్షుడు డాక్టర్ అలువాల ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి దాసరి తిరుమల, ప్రతినిధులు ఖాజా నిజాముద్దీన్, చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ పరమేశ్వర్, స్కూల్ హెచ్‌ఎం చక్రవర్తులు రమాదేవి, గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, జనగాం రాజమల్లు, లకావత్ ఉమ, నాగుల వీణ, బైరి వాణిశ్రీ, కడార్ల కల్పన, నందాల శంకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీలు

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండలం కొదురుపాకలో ఈనెల 25, 26 తేదీల్లో ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ర్యాకం రాజేశ్ తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, బోయినపల్లి సింగిల్‌విండో చైర్మన్ జోగినిపల్లి వెంకట్రామారావు, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కూస రవీందర్ పాల్గొంటారని పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
RESTAURANT FOR SALE
■ Fully Equipped Running Restaurant for Sale 200+Seater - Prime Commercial hub in Karimnagar Jagithyal Road, with ample common parking. Ready-to-operate setup with complete equipment included. Perfect for launching any restaurent venture. Cont: 8143573739 [W-1264127]

SERVICES
■ Israel Electronic Visit Visa (e-visa) for Tourism. Processing time 15 days. Contact for Details on WhatsApp 96661 00012 [HA-8205]

BUSINESS SERVICES
■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మర్వాడి షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్. [SCA25001311]

WANTED
■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256044]

■ ప్రముఖ మైనింగ్ కంపెనీకి 5-10 సం॥ అనుభవం గల HR / ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్, టిప్పర్ IT డీజిల్ మెకానిక్స్-2, Sr & Jr ఎలక్ట్రీషియన్స్ -2 వెంటనే కావలెను. కేశవ్ 99894 88310 [B-454]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీతం: 18K Ph: 9160900024, 9640400073 [SCA25001362]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824